E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 25-07-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



తెలంగాణ సచివాలయంలో మరోసారి ఊడిపడ్డ పెచ్చులు » 3లో

## మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటా

- » అభిమానుల రుణం తీర్చుకోలేనిది
- » పుట్టినరోజు వేడుకల్లో కేటీఆర్
- » తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న మాజీ మంత్రి
- » సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురి శుభాకాంక్షలు

ఈ కబురు, హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

తరువాయి 2లో



## బ్రిటన్ కింగ్ ఛార్లెస్‌ను కలిసిన మోదీ

ఈ కబురు,లండన్: బ్రిటన్‌లో పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడ బ్రిటన్ రాజు ఛార్లెస్‌ను కలిశారు. గురువారం రాజు అధికారిక నివాసాల్లో ఒకటైన నోర్ఫోక్ » 3లో



## భారత్‌బ్రిటన్ మధ్య


### కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం

- » 99% భారత ఉత్పత్తులకు సుంకాల నుంచి మినహాయింపు!
- » మోదీ, స్టార్మర్ సమక్షంలో సంతకాలు
- » ఒప్పందంతో ఇరుదేశాల మధ్య ఏటా రూ.2.94 లక్షల కోట్ల వ్యాపారం!
- » సరికొత్త అధ్యాయాన్ని లిఖించాం
- » భారత యువత, రైతులు, ఎంఎస్ఎంఈలకు లబ్ధి: మోదీ



తరువాయి 2లో

# మోదీ కన్వర్టెడ్ బీసీ.. బీజేపీ బీసీ వ్యతిరేకి




- » బీసీ బిల్లుల ఆమోదానికి ఎంపీలుగా మీరు పార్లమెంటులో కొట్లాడండి
- » నేను, మా ఎమ్మెల్యేలు కలిసి జంతర్ మంతర్ వద్ద పోరాడుతాం
- » ఇది 'రేర్' సర్వే.. 'రేర్' అంటే త్వరలో చెబుతా
- » కాంగ్రెస్ ఎంపీలకు రేవంత్ ప్రజెంటేషన్
- » తెలంగాణ సమగ్ర కుల సర్వే డేటా మొత్తం 88 కోట్ల పేజీలు వచ్చిందని వెల్లడి
- » కుల సర్వే, బీసీ బిల్లుల ఆమోదంపై సోనియా లేఖ.. నాకు నోబెల్, ఆస్కార్‌తో సమానం

ఈ కబురు :తెలంగాణలో తమ ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి ప్రజల స్వీయ ధ్రువీకరణ పత్రంతో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల (ఎస్ఈఈఈపీసీ) సర్వే దేశానికే ఆదర్శం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమగ్ర వివరాలతో క్షుణ్ణంగా చేపట్టిన ఈ సర్వేకు సంబంధించి.. తమ వద్ద 88 కోట్ల పేజీల డేటా ఉందని తెలిపారు. ఈ సర్వేపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారని గుర్తుచేసిన ఆయన.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఫిబ్రవరి 4న సర్వేను ప్రారంభించి 2025, ఫిబ్రవరి 4నాటికి పూర్తి చేశామని తెలిపారు. అందుకే, ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నామని వెల్లడించారు. కుల గణనకు సంబంధించి తమ ప్రభుత్వం 56 ప్రశ్నలతో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి సమాచారం సేకరించిందని.. సర్వే సమయంలో అందుబాటులో లేనివారికి ఆన్‌లైన్ ద్వారా, టోల్ ఫ్రీ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించామని వివరించారు. సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారని తెలిపారు. సర్వేలో 3.9 శాతం మంది తమకు కులం లేదని చెప్పారని.. ఇది తెలంగాణలో సరికొత్త పరిణామమని రేవంత్ అన్నారు. సర్వే ప్రకారం తాము స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని గుర్తుచేశారు. బీజేపీ తొలి నుంచి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని రేవంత్ ఈ సందర్భంగా విమర్శించారు. ప్రధాని మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని పునరుద్ఘాటించారు.

తరువాయి 2లో

## 50 శాతం రిజర్వేషన్ల గోడ బద్దలు కొడతాం




తరువాయి 2లో

- » తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతాం
- » ఓబీసీల సమస్యలపై స్పందనలో కాంగ్రెస్ కొంత వెనుకబడింది
- » ఈ విషయంలో మనమే భాజపాకు అవకాశమిచ్చాం..

డబ్ల్యూడబ్ల్యూఎఫ్ దిగ్గజం హల్క్ హొగన్ కన్నుమూత » 6లో



నేను వార్‌2లో ఎందుకు నటించ లేదంటే..: వాణీ కపూర్ » 5లో



ట్రేడ్ డీల్‌తో.. స్కాచ్ విస్కీ, కార్ల ధరలు తగ్గను న్నాయా?» 4లో



## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్య: శ్రీధర్‌బాబు



- » ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్య: దుద్దిళ్ల
- » యంగ్ ఇండియా సమీకృత గురుకులానికి శంకుస్థాపన

తరువాయి 2లో



భారతీయులను నియమించుకోవద్దు » 3లో

## దేశానికి ఆదర్శంగా కుల సర్వే

» ఈ కబురు, ఢిల్లీ - హైదరాబాద్: తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను న్యాయవివాదాలకు తావివ్వకుండా, దేశానికి ఆదర్శంగా నిర్వహించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సర్వే ద్వారా 1.12 కోట్ల కుటుంబాల్లోని 3.55 కోట్ల మంది వివరాలు తీసుకున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో



తరువాయి 3లో



నాలుగో రోజూ అదే తీరు » 3లో

## రష్యాలో ఘోర విమాన ప్రమాదం



» 49 మంది దుర్మరణం

ఈ కబురు,మాస్కో: రష్యాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. మొత్తం 49 మందితో వెళ్తున్న ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలోని ఓ అడవిలో కుప్పకూలింది. విమానంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆరుగురు సిబ్బందిసహా 49 మంది ప్రాణాలు కోల్పోయారు.

తరువాయి 3లో



సహకార విధానాన్ని ప్రకటించిన అమిత్‌షా » 3లో


## ఆర్అండ్‌బీ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

» 3లో



మొదటి పేజీ తరువాయి

# మోదీ కన్వర్టెడ్ బీసీ.. బీజేపీ బీసీ వ్యతిరేకి




రాహుల్ వల్లే..

తాము జనగణనతోపాటు కుల గణన చేపట్టబోమని రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంట్లో చెప్పారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. రైతులకు సంబంధించిన నల్లచట్టాల విషయంలో రాహుల్ గాంధీ గళం విప్పిన తర్వాత ప్రధాని మోదీ వాటిని రద్దు చేసి క్షమాపణ చేశారని.. అదే కోవలో ఇప్పుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు తెలంగాణ సర్కారు కులగణన చేపట్టిన తర్వాత కేంద్రం కూడా కులగణనకు అంగీకరించిందని.. ఇదంతా రాహుల్ ఘనతేనని ఆయన పేర్కొన్నారు. తాము చేపట్టిన సర్వే దేశానికే ఆదర్శం అని... ఇది తెలంగాణ మోడల్ అని, తాను దీనిని రేర్ (ఆర్ఏఆర్ఈ) మోడల్ అంటున్నానని తెలిపారు. రేర్ అంటే ఏమిటో త్వరలో వివరిస్తానన్నారు. తెలంగాణ శాసనసభలో తాము ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను.. లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదింపజేసేందుకు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వంలో పోరాడాలని ఎంపీలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీనిపై తాను తన మంత్రులు, శాసనసభ్యులతో కలిసి జంతర్ మంతర్‌లో పోరాడతానని, ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడాలని కోరారు. కుల సర్వేను కొందరు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కుల సర్వే, బీసీ బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సోనియా గాంధీ స్వహస్తాలతో లేఖ రాశారని.. ఆ లేఖ తనకు నోబెల్, ఆస్కార్, జీవన సాఫల్య పురస్కారం (లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్) అని చెబుతూ రేవంత్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ స్థానంలో ఉన్నా లేకున్నా ఆ లేఖ తనకు ప్రత్యేకంగా మిగిలిపోతుందని సీఎం పేర్కొన్నారు. కాగా.. ఈ సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏఐసీసీ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ప్రసంగించారు. పీసీసీ అధ్యక్షుడు కార్యక్రమ సంధానకర్తగా వ్యవహరించారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అగ్ర నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ ఎంపీలు, స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత.. గురువారం ఉదయమే.. సీఎం రేవంత్ బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఖర్గే నివాసంలో భేటీ అయ్యారు. సర్వే ప్రక్రియ, అసెంబ్లీలో బిల్లుల ఆమోదం, పార్లమెంట్‌లో వాటి ఆమోదంపై చర్చించారు.

పొరపాట్లు లేకుండా..

రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు.. తెలంగాణలో చేపట్టిన కుల గణన ఒక చరిత్ర అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ మొత్తాన్ని బ్లాక్‌లుగా విభజించి.. ఎలాంటి పొరపాట్లూ లేకుండా సర్వే నిర్వహించామని అన్నారు. ఇక.. ఈ కులగణనకు చట్టపరంగా ఎటువంటి చిక్కులు ఏర్పడ్డా తట్టుకుని అంతిమంగా విజయం సాధిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే బీసీల సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ అంశాలపై కుల గణన చేపట్టి ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని అమలు చేయడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు మెట్లెక్కినా అంతిమంగా విజయం రాష్ట్ర ప్రభుత్వానిదేనని ధీమా వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను గవర్నర్ ఆమోదించి రాష్ట్రపతికి పంపినా నాలుగు నెలలుగా అవి పెండింగ్‌లో ఉండడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.

ప్రియాంక గాంధీతో రేవంత్ భేటీ

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తెలంగాణ కుల సర్వే వివరాలను ఆమెకు అందించినట్టు తెలిపారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో ఓబీసీలకు 42 శాతం కోటా కల్పించాలనే నిర్ణయాన్ని, సంకల్పాన్ని ప్రియాంక అభినందించారని వెల్లడించారు. ఓబీసీలకు పూర్తి న్యాయం కోసం జరిగే ఈ పోరాటంలో మద్దతుగా నిలుస్తానంటూ ఆమె హామీ ఇచ్చినట్టు చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# భారత్‌బ్రిటన్ మధ్య
## కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం



లండన్, ఈ కబురు: భారత్‌బ్రిటన్ మధ్య వాణిజ్యానికి సంబంధించి చరిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలు 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' కుదుర్చుకున్నాయి. 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)' పేరిట రూపొందించిన ఈ ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో గురువారం ఇరుదేశాల వాణిజ్య శాఖల మంత్రులు పీయూష్ గోయెల్, జోనాథన్ రెనాల్డ్స్ సంతకాలు చేశారు. లండన్‌లోని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అధికారిక నివాసంలో ఈ ఒప్పందం జరిగింది. దీని ద్వారా భారత్‌బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు ఇరు దేశాల మధ్య ఏటా దాదాపు రూ.2.94 లక్షల కోట్ల వాణిజ్యం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2030నాటికి ఇది రూ.9.75 లక్షల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. 2020లో యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ చేసుకున్న భారీ వాణిజ్య ఒప్పం దం ఇదేకావడం గమనార్హం. మూడేళ్లు చర్చలు జరిగిన తర్వాత ఇరుదేశాలు సీఈటీఏపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంతో భారత్‌కు చెందిన అన్ని రకాల వస్తువులకు బ్రిటన్ మార్కెట్‌లో ప్రవేశం దక్కడమే గాక, సుంకాల భారం కూడా తప్పనుందని అధికారులు తెలిపారు. 99 శాతం భారతీయ ఉత్పత్తులకు యూకే మార్కెట్‌లో సుంకాలు ఉండవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ.. ''ఇరు దేశాలకు ఇదో చరిత్రాత్మక దినం. పరస్పర చిత్తశుద్ధికి నిదర్శనం.ఇలాంటి శుభసందర్భంలో మీకు స్వాగతం పలకడం నాకెంతో సంతోషంగా ఉంది'' అని మోదీకి అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌బ్రిటన్‌లు సహజ భాగస్వాములని చెప్పారు. ఇరుదేశాలు చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయన్నారు. తాజా ఒప్పందంతో భారతీయ దుస్తులు, పాదరక్షలు, వజ్రాలు, ఆభరణాలు, సముద్ర ఆహారోత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులకు యూకే మార్కెట్‌లో మరింత చోటు లభించనుందని పేర్కొన్నారు. ''ఈ ఒప్పందం ప్రత్యేకించి భారత యువత, రైతులు, మత్స్యకారులతోపాటు ఎంఎస్ఎంఈ రంగానికి లబ్ధి చేకూర్చుతుంది. అదే సమయంలో యూకేలో తయారయ్యే వైద్య పరికరాలు, ఏరోస్పేస్ విడిభాగాలువంటి ఉత్పత్తులు భారతీయులకు అందుబాటు ధరల్లో లభిస్తాయి'' అని మోదీ చెప్పారు. ''భారత్‌బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్2035 లక్ష్యంగా సాగుతున్నాం. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో కలిసి సాగుతాం. బ్రిటన్, భారత్ భాగస్వామ్యం కొత్త పుంతలు తొక్కనుంది. ఆరు బ్రిటన్ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఆర్థిక, సాంకేతిక రంగాల్లోనూ కలిసి పనిచేయాలని నిర్ణయించాం'' అని మోదీ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. బ్రిటిష్ గడ్డపై ఖలిస్థానీ అనుకూల శక్తులు పెరుగుతున్న నేపథ్యం లో ప్రధాని పరోక్షంగా వారికి చురకలంటించారు. ప్రపంచదేశాల మధ్య శాంతిని నెలకొల్పే విషయంలో భారత్‌బ్రిటన్‌లు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన బ్రిటన్ పౌరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్టార్మర్‌ను భారత పర్యటనకు రావాలని ఆహ్వానించారు.

ఇరుదేశాలకు భారీ ప్రయోజనం: స్టార్మర్

వాణిజ్య ఒప్పందంతో బ్రిటన్, భారత్‌కు భారీ ప్రయోజనాలు కలుగుతాయని స్టార్మర్ చెప్పారు. ఈ ఒప్పందం ఉద్యోగాలకు, వ్యాపారాలకు మంచిదని.. సుంకాలు తగ్గిపోతాయని, వాణిజ్యం చౌకగా, వేగంగా, సులభంగా మారుతుందని పేర్కొన్నారు. ఒప్పందం అమల్లోకివస్తే..యూకే ఉత్పత్తులపై భారత్ ప్రస్తుతం విధిస్తున్న సగటు సుంకం 15 నుంచి 3 శాతానికి తగ్గనుందని బ్రిటన్ అధికారులు తెలిపారు. సాఫ్ట్ డ్రింక్స్, చాక్లెట్లు, కాస్మెటిక్స్, కార్లు, వైద్య పరికరాలు వంటివి బ్రిటన్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. బ్రిటన్‌లోని విస్కీ తయారీదారులకు భారీగా లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం 150% ఉన్న సుంకం 75శాతానికి తగ్గనుంది. వచ్చే పదేళ్లలో ఇది 40శాతానికి తగ్గనుందని బ్రిటన్ అధికారులు తెలిపారు. ఈ ఒప్పందం వల్ల విస్కీ, కార్లు, ఇతర ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి చేసే బ్రిటన్ తయారీదారులకు ఎంతోమేలు చేకూరనుంది. భారత్, బ్రిటన్‌లు రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్‌కు ఆమోదం తెలిపాయి.

ఒప్పందంలో కీలక అంశాలు..

భారత్‌కు చెందిన అనేక వ్యవసాయ ఉత్పత్తులకు యూకే మార్కెట్లో పన్నులు ఉండవు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పసుపు, మిరియాలు, యాలకులు, శుద్ధి చేసిన ఆహారం, మామిడి గుజ్జు, పచ్చళ్లు, పప్పులు వంటి వాటికి ఎలాంటి పన్నులూ వేయరు. మఖానా, షాహీలిచి, అరకు కాఫీ, కశ్మీరీ కుంకుమపువ్వు వంటివి యూకే మార్కెట్‌లో మరింత ఎక్కువగా అమ్ముడుపోతాయని, తద్వారా సంబంధిత రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. పన్నులు లేకపోవడంవల్ల వచ్చే మూడేళ్లలో బ్రిటన్‌కు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 20శాతం పెరుగుతాయని అంచనా. డెయిరీ ఉత్పత్తులు, వంట నూనెలు, యాపిల్‌లను ఈ ఒప్పందం నుంచి మినహాయించారు. ఓట్స్‌కూ పన్ను రాయితీలు లేవు. ఫార్మా, రసాయనాలు, ప్లాస్టిక్స్, క్రీడా ఉత్పత్తులు, బొమ్మలు, వజ్రాలు, ఆభరణాలు, తోలు ఉత్పత్తులు వంటి వాటికీ భారీగా లబ్ధి చేకూరనుంది.

మొదటి పేజీ తరువాయి

# 50 శాతం రిజర్వేషన్ల గోడ బద్దలు కొడతాం

ఈ కబురు, దిల్లీ: 'రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టి ఆయన తన బాధ్యతలను ఎంతో విజయవంతంగా నిర్వర్తించారు. ఇప్పుడు ఈ డేటాను ఉపయోగించుకొని ప్రజల జీవితాలను మార్చడమే ఆయన ముందున్న కర్తవ్యం' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన సర్వే వివరాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు తీసుకురావడానికి దారితీసిన పరిస్థితులపై పార్టీ ఎంపీలకు గురువారం ప్రజంటేషన్ ఇచ్చారు. ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. సర్వే వివరాల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించిన తర్వాత ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ''తెలంగాణలో ఏం జరుగుతోందో... దాన్ని అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఏంచేస్తోందో దేశ ప్రజలకు చెప్పడం ఇక మా బాధ్యత. మేం 50% రిజర్వేషన్ల గోడను బద్దలుకొడతామని చెప్పాం. అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించే బిల్లులను పాస్‌చేసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితే కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించి 50% గోడను బద్దలు కొట్టడమే మా పని. కులగణన నిర్వహణలో రేవంత్‌రెడ్డి, తెలంగాణ నాయకులు, నిపుణుల కమిటీ సభ్యులు అద్భుతంగా పనిచేశారు. ఇది తెలంగాణ ప్రజలకో గొప్ప ముందడుగు. ఇందులో భాగస్వామినైనందుకు గర్వపడుతున్నా. ఖర్గే మద్దతు తెలపకపోతే ఇది సాధ్యమయ్యేదికాదు. ఇదే సమయంలో ఒక వ్యక్తిగత అభిప్రాయం చెప్పాలనుకుంటున్నా. దీంతో మిగతావాళ్లు అంగీకరించకపోవచ్చు. కానీ నా మనసులో మాట చెబుతున్నా. దళితులు, ఆదివాసీలు, మహిళల సమస్యలు వచ్చినప్పుడు కాంగ్రెస్‌పార్టీ సరిగానే స్పందిస్తోంది. ఓబీసీల అంశాలు వచ్చినప్పుడు వాటిని అర్థంచేసుకోవడంలో, చర్యలు తీసుకోవడంలో కొంత వెనుకబడి ఉన్నట్లు భావిస్తున్నా. వారి ఆకాంక్షలు, సమస్యలపై సరిగా స్పందించకపోవడంవల్ల మనమే భాజపాకు అవకాశాన్ని ఇచ్చినట్లు భావిస్తున్నా. కాంగ్రెస్ పార్టీగా మనం అన్ని సామాజికవర్గాల సమస్యల పట్ల స్పందించాలి. కాంగ్రెస్ నిజాయతీతో ఉందని ప్రతి సామాజికవర్గం భావించాలి. ప్రతి ఒక్కరినీ పరిగణనలోకి తీసుకొని భారతీయులందర్నీ రక్షిస్తోందన్న నమ్మకం కలిగించాలి'' అని తెలంగాణ కాంగ్రెస్ నాయకులతోపాటు, కాంగ్రెస్ ఎంపీలందరికీ రాహుల్ పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డికి కష్టమవుతుందేమో అనుకున్నా

తెలంగాణలో కులగణన సర్వే నిర్వహిస్తామని చెప్పినప్పుడు మనసులో ఎక్కడో అనుమానం ఉండేది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కష్టమవుతుందేమోనని అనుకున్నా. బహుశా వారి సామాజికవర్గం దాన్ని స్వాగతించకపోవచ్చు కాబట్టి ఇదేమీ అంత సులభం కాదనుకున్నా. కానీ రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు నా అంచనాలకు మించి చాలా సులభంగా పనిచేశారు. ఈ కులగణనను నిజమైన స్ఫూర్తితో చేయొచ్చు... లేదంటే అసమర్థంగానూ నిర్వహించొచ్చు. కానీ తెలంగాణ నాయకులంతా దీన్ని నిజమైన స్ఫూర్తితో పూర్తిచేశారు. దేశ సామాజిక న్యాయ ప్రస్థానంలో ఇదొక మైలురాయిగా నిలిచేలా నిర్వహించారు. భాజపా అంగీకరించినా, అంగీకరించకపోయినా జాతీయ కులగణన ఎలా ఉండాలన్నదాన్ని ఇది నిర్వచించి చెప్పింది. కులగణనకు ప్రశ్నావళిని బ్యూరోక్రాట్ల నాలుగు గోడల మధ్య ఖరారు చేయకుండా... తలుపులు తెరిచి విభిన్న వర్గాలకు చెందిన లక్షల మందితో మాట్లాడారు. అంతిమంగా ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను సంపూర్ణంగా వెలికితీసేలా 56 సంక్లిష్టమైన ప్రశ్నలను ఖరారు చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ప్రశ్నల ఆధారంగా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సరిగా చేయలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తే... వారు వచ్చి తమ వివరాలు చెప్పుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త వేదిక కల్పించింది.




భాజపా కులగణన సరిగా చేయదు

భాజపా భవిష్యత్తులో కులగణనను సరైన విధానంలో చేయదని నేను నమ్ముతున్నా. వాళ్లు దేశంలోని దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, సాధారణ కులాల వాస్తవిక పరిస్థితులను బహిర్గతం చేయాలనుకోవడంలేదు. ఒకవేళ దేశ ప్రజలకు వాస్తవం తెలిస్తే వారి భావజాలం చచ్చిపోతుంది.

ఇంగ్లిష్ విద్యనూ పిల్లలకు నేర్పాలి

రాహుల్‌గాంధీతెలంగాణ కులగణన నిపుణుల బృందం సభ్యులు భూక్యా బంగ్యా, కంచ ఐలయ్య, ఈరోజు తెలంగాణలో వ్యక్తిగత సక్సెస్‌ను నిరూపించే ఒక ప్రధాన కారణం ఏంటో చెప్పాలని అడిగితే రేవంత్‌రెడ్డి 'చదువు' అని సమాధానం ఇచ్చారు. చదువుతో వేగంగా అభివృద్ధి చెందొచ్చని చెప్పారు. అయితే విద్యలో ముఖ్యం ఏంటన్నది రేవంత్‌రెడ్డి చెప్పలేదు. అది ఇంగ్లిష్. ఇప్పుడు దేశంలో ఇంగ్లిష్ విద్యే వ్యక్తి విజయాన్ని నిర్ణయిస్తోంది. ప్రాంతీయ భాషల్లో చదివే చదువులకన్నా ఇంగ్లిష్ విద్య అత్యంత శక్తిమంతంగా తయారైంది. హిందీ, ఇతర ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం లేదని నేను చెప్పడంలేదు. కానీ ఇంగ్లిష్ విద్యే మన పురోగతిని నిర్దేశిస్తోంది.

అందువల్ల ప్రాంతీయ భాషలతోపాటు ఇంగ్లిష్ విద్యను పిల్లలకు నేర్పాలి. ఇది అంగీకరించకతప్పని చారిత్రక వాస్తవం. ఇంగ్లిష్ రద్దు చేయాలంటున్న భాజపా నాయకులను మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారని అడిగితే.. అందరూ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలోనే అని చెబుతారు. ఆ అవకాశాన్ని ఈ దేశంలోని దళితులు, ఆదివాసీలు, ఓబీసీ మహిళలు, నిరుపేదలకు ఎందుకు ఇవ్వకూడదు'' అని రాహుల్ ప్రశ్నించారు.

మన చేతుల్లో ఉన్న సమాచారాన్ని తక్కువగా అంచనా వేయొద్దు. 50, 60, 70 దశకాలలో శక్తి ఎక్కడి నుంచి వస్తుందని అడిగితే చమురు నుంచి అని చెప్పేవాళ్లు. ఇప్పుడు అదే ప్రశ్నను బిల్‌గేట్స్‌నో, డొనాల్డ్ ట్రంప్‌నో అడిగితే డేటాయే ఈరోజున్న శక్తి అని చెబుతారు.

ప్రస్తుతం తెలంగాణ చేతిలో 21వ శతాబ్దపు సామాజిక, ఆర్థిక, రాజకీయ డేటా ఉంది. దీని ఆధారంగా వీధి స్థాయిలో అభివృద్ధిని కూడా లక్ష్యంగా పెట్టుకొని పనిచేసే అవకాశం ఉంది. ఈ సామర్థ్యం దేశంలో మరే రాష్ట్రానికీ లేదు. ఇదో సామాజిక, ఆర్థిక, రాజకీయ అస్త్రం. దీని ద్వారా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 50% రిజర్వేషన్ల పరిమితి గోడలను బద్దలు కొట్టి హిందుత్వ రాజకీయాలను ధ్వంసం చేయొచ్చు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్య



ఈ కబురు, :ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మునిసిపాలిటీ పరిధిలోని తుంకులగడ్డలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి గురువారం స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉజ్వల భవితను అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అందుకోసం కోట్లాది రూపాయల ఖర్చుతో సమీకృత పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. కులాలకతీతంగా విద్యను అందించాలనే ఒక మంచి సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సమీకృత పాఠశాలల్లో కార్పొరేట్‌కు మించిన వసతులు ఉంటాయని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. పరిగి ప్రాంతానికి సాగునీరు అందించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి అన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం గురించి చర్చిస్తానని తెలిపారు.

# మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటా

ఈ కబురు, హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరవడంతో.. భవన్ పరిసరాలు కోలాహలంగా మారాయి. కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు, అభిమానుల మధ్య కేటీఆర్ కేక్ కోశారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. భారీగా సేవా కార్యక్రమాలు చేస్తున్న అభిమానుల రుణం తీర్చుకోలేనని, ఈ ప్రేమాభిమానాలతో మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటానని ఆయన అన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, సీహెచ్ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా తండ్రి, భారాస అధినేత కేసీఆర్, తల్లి శోభల ఆశీర్వాదం పొందడానికి తన భార్య శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలసి కేటీఆర్ ఎర్రవెల్లి నివాసానికి వెళ్లారు. తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా తన కుమారుడు కేటీఆర్‌ను కేసీఆర్ ఆలింగనం చేసుకుని ఆశీర్వదించారు. పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం ఆకాంక్షించారు. ఇంకా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు కేటీఆర్‌కు 'ఎక్స్'లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# బ్రిటన్ కింగ్ ఛార్లెస్‌ను కలిసిన మోదీ

ఈ కబురు,లండన్: బ్రిటన్‌లో పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడ బ్రిటన్ రాజు ఛార్లెస్‌ను కలిశారు. గురువారం రాజు అధికారిక నివాసాల్లో ఒకటైన నోర్ఫోక్ ప్రాంతంలోని సాంద్రింగ్‌హామ్ హౌస్‌కు విచ్చేసిన మోదీని ఛార్లెస్ సాదరంగా ఆహ్వానించారు. ఇద్దరూ కొద్దిసేపు పలు అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఛార్లెస్‌కు మోదీ తెల్లని పూరెమ్మలు ఉండే సోనోమా డేవిడియా ఇన్వాలుక్రాటా అనే వింతైన మొక్కను బహూకరించారు. ఈ చెట్టుకు పూసే పూలను దూరం నుంచి చూస్తే గాల్లో ఎగిరే తెల్లపావురాల్లా కనిపిస్తాయి. శ్వేతవర్ణ పూరెమ్మలు ఉండటంతో దీనిని హ్యాండ్‌కర్చీఫ్ చెట్టు అని కూడా అంటారు. అమ్మ పేరిట ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా ఛార్లెస్‌కు మోదీ ఈ మొక్కను బహుమతిగా అందించారు. తల్లిని గుర్తుచేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెల్సిందే. సాధారణంగా డేవిడియా మొక్క నాటిన 20 ఏళ్ల తర్వాతే పూలు పూస్తుంది. కానీ సోనోమా రకం సంకరజాతి మొక్క కేవలం రెండు, మూడేళ్లలోనే విరగబూస్తుంది.



మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ సచివాలయంలో మరోసారి ఊడిపడ్డ పెచ్చులు





ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో మరోసారి పెచ్చులు విరిగిపడ్డాయి. భారీ వర్షానికి సీఎం రేవంత్ కాన్వాయ్ వచ్చే మార్గంలోనూ పెచ్చులు కూలాయి. పెచ్చులు ఊడి పడడంతో సచివాయం సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కాగా, గత వారం రోజుల నుంచి సచివాలయానికి సిబ్బంది రిపేర్లు చేస్తున్నారు. సచివాలయంలో పెచ్చులు ఊడి పడుతున్న ఘటనలపై సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణ సచివాలయలో పీవోపీ పార్టిషన్ స్వల్పంగా కూలింది. పెచ్చులు ఊడిపడ్డాయి. సీఎం ఛాంబర్ అంతస్తులో పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడి.. రామగుండం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కారుపై పడ్డాయి. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పెచ్చులు ఊడిపడడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. పీఓపీ పెచ్చులు ఊడి పడటంతో అధికారులు, భద్రత్రా సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇటీవలే కొత్తగా నిర్మించిన తెలంగాణ సచివాలయం పీఓపీ కూలడం చర్చనీయాంశంగా మారింది. సచివాలయ నిర్మాణ లోపాలపై చర్చ జరుగుతోంది.

**ఘటనపై స్పందించిన సచివాలయ నిర్మాణ సంస్థ**

సెక్రటేరియట్ పెచ్చులు ఊడిన ఘటనపై షాపూర్‌జీ పల్లోంజీ నిర్మాణ సంస్థ స్పందించింది. '' రెగ్యులర్ డిపార్ట్‌మెంట్ పనుల్లో భాగంగా కేబుల్, లైటింగ్ కోసం పనులు చేపట్టినట్లు పేర్కొంది. నిర్మాణం ప్రాబ్లం కాదని.. అది కాంక్రీట్ వర్క్ కాదని తెలిపింది. స్ట్రక్చర్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని.. ఊడి పడింది జీఆర్‌సీ ఫ్రేం. ఇటీవల లైటింగ్ కోసం, కొత్త కేబుల్స్ కోసం జీఆర్ఎసీ డ్రిల్ చేస్తున్నారు.. దీంతో జీఆర్‌సీ డ్యామేజ్ అవుతుంది. స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయి రెండేళ్లు అవుతోంది. ఎలాంటి నాణ్యత లోపం లేదు. మేము ఘటనపై రివ్యూ చేస్తున్నాం అని'' ఆ సంస్థ వెల్లడించింది. తాజాగా, మరోసారి సచివాలయంలో పెచ్చులు ఊడడం చర్చాంశనీయంగా మారింది.

మొదటి పేజీ తరువాయి

# రూ.1,000 కోట్లతో 2,000 కి.మీ. రోడ్ల అభివృద్ధి



ఈ కబురు, అమరావతి: న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ప్రాజెక్ట్, కేంద్ర రహదారి నిధి (సీఆర్ఎఫ్) కింద మంజూరై, పనులు చేపట్టకపోవడంతో గతంలో రద్దుచేసిన.. 2వేల కి.మీ.మేర రహదారులను రూ.1,000 కోట్లతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు అంచనాలు రూపొందించి, త్వరగా టెండర్ల ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రమంతటా 20 వేల కి.మీ. మేర గుంతలు లేకుండా రహదారుల మరమ్మతులు పూర్తిచేయగా, మిగిలిన రోడ్లను కూడా రూ.500 కోట్లతో గుంతలు రహితంగా మార్చాలని ఆదేశించారు. వర్షాకాలం అయినప్పటికీ.. వీలున్న చోట్ల త్వరగా గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. గురువారం సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రహదారుల నిర్మాణం, మరమ్మతుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో.. రోడ్లన్నీ అధ్వానంగా మారాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని రోడ్లు మరమ్మతులు చేయాల్సి ఉంది, ఎన్ని పునరుద్ధరించాలి, నిర్వహణకు ఏయే రహదారులను అప్పగించాలి.. తదితర అంశాలతో 15 రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

**50 కి.మీ.కు ఓ సీసీ కెమెరా..**

రాష్ట్ర రహదారులన్నింటినీ.. జాతీయ రహదారుల స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని సీఎం ఆదేశించారు. సంప్రదాయ విధానంలోనే కాకుండా కొత్త కొత్త టెక్నాలజీతో రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలని తెలిపారు. వైట్ టాపింగ్‌తో సిమెంట్ రోడ్లు, సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా నిర్మిస్తున్న ప్లాస్టిక్ రోడ్లు, ఫుల్ డెప్త్ రిక్లమేషన్ టెక్నాలజీ వంటివన్నీ పరిశీలించాలని చెప్పారు. రహదారుల నిర్వహణ పనులను గుత్తేదార్లకు అప్పగించి, వర్షాకాలంలో ఆయా రోడ్లు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రహదారి ఏ గుత్తేదారు నిర్మించారు, నిర్వహణ పనులు చూసేది ఎవరన్న వివరాలన్నీ రోడ్ల వారీగా ఆన్‌లైన్‌లో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి 50 కి.మీ. ఒక సీసీ కెమెరా చొప్పున ఏర్పాటు చేయాలని, దీనివల్ల ఆయా రోడ్లపై ఎంత ట్రాఫిక్ ఉంటోందనేది తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

**పీపీపీ విధానంలో రోడ్ల విస్తరణపై అధ్యయనం**

రాష్ట్రంలో 12,653 కి.మీ. రాష్ట్ర రహదారులు ఉండగా, వీటిలో 10,200 కి.మీ. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం విధానం (పీపీపీ)లో విస్తరించేందుకు అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో అత్యధిక రద్దీ ఉన్న 18 రోడ్లు (1,332 కి.మీ) ఫేజ్ 1ఎ కింద, 40 కి.మీ. కంటే పొడవున్న 67 రహదారులు (3,854 కి.మీ.) ఫేజ్ 1బి కింద, మిగిలిన 175 రోడ్లు (5,039 కి.మీ) ఫేజ్ 2 కింద విస్తరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. యలమంచిలిగాజువాక, గాజుల మండ్యంశ్రీసిటీ రోడ్లను కూడా పీపీపీ విధానంలోనే విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిపై మరింత అధ్యయనం చేసి తుది నివేదిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

మొదటి పేజీ తరువాయి

## భారతీయులను నియమించుకోవద్దు



**ఈ కబురు,వాషింగ్టన్: అమెరికాకు చెందిన టెక్ కంపెనీలు.. చైనాలో పరిశ్రమలు నిర్మించడం, భారతీయ ఉద్యోగులను నియమించుకోవడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "చాలా కాలంగా అమెరికా రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించింది. ఈ కారణంగా చాలామంది అమెరికన్లకు ద్రోహం జరిగింది. మన దేశంలోని భారీ టెక్ కంపెనీలు చైనాలో తమ సంస్థలను నెలకొల్పుతున్నాయి. భారతీయ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకొని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. ఇక్కడి ప్రజల అవకాశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇకపై అన్ని కంపెనీలు దేశానికే తొలి ప్రాధాన్యమిస్తూ పనిచేయాలి" అని ట్రంప్ పేర్కొన్నారు.**

మొదటి పేజీ తరువాయి

# దేశానికి ఆదర్శంగా కుల సర్వే




ఈ కబురు, దిల్లీ హైదరాబాద్: తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను న్యాయవివాదాలకు తావివ్వకుండా, దేశానికి ఆదర్శంగా నిర్వహించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సర్వే ద్వారా 1.12 కోట్ల కుటుంబాల్లోని 3.55 కోట్ల మంది వివరాలు తీసుకున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో కులసర్వేపై గురువారం దిల్లీలో పార్టీ అగ్రనేతల సమావేశం, సాయంత్రం నిర్వహించిన ప్రజంటేషన్ కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ద్వారా కులసర్వే నిర్వహించిన తీరును వివరించారు. ''కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుల సర్వేను విజయవంతంగా పూర్తిచేశాం. ఎలాంటి న్యాయవివాదాలు తలెత్తకుండా చట్టబద్ధంగా నిర్వహించేందుకు మంత్రిమండలి, శాసనసభ తీర్మానం తీసుకున్నాం. ఈ సర్వే చేసేందుకు ముందుగా స్థానిక పౌరసంఘాలతో సంప్రదింపులు నిర్వహించి... అందరి ఆమోదంతో ప్రశ్నావళి సిద్ధం చేశాం. మొత్తం 75 అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో ప్రజల నుంచి సమగ్ర సమాచారం తీసుకున్నాం. కొన్ని కారణాలతో జీహెచ్ఎంసీ తదితర ప్రాంతాల్లోని 3.56 లక్షల కుటుంబాలు తొలుత సర్వేలో పాల్గొనలేదు. వారికీ అవకాశమిచ్చి వివరాలు తీసుకున్నాం. ఈ సమాచారాన్ని కంప్యూటరీకరించి సమగ్ర డేటాను రూపొందించాం. కులసర్వేపై స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించాం. ఈ కమిటీ సర్వే సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి.. ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వానికి 300 పేజీలతో కూడిన నివేదిక ఇచ్చింది. చాలా కచ్చితంగా సర్వే పూర్తిచేసి డేటా సేకరించినందున దీన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు. ఇది ఏ సమీక్షకైనా, తీర్పులకైనా నిలబడుతుంది'' అని భట్టి పేర్కొన్నారు.

**ఇదో విప్లవాత్మక ముందడుగు**

**రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

మేం చాలా సమగ్రంగా సర్వే నిర్వహించాం. ఇది ఏ న్యాయసమీక్షకైనా నిలబడుతుందని నమ్ముతున్నాం. ఈ సర్వే ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేసి రాష్ట్రపతి అనుమతి కోసం పంపారు. రాహుల్‌గాంధీ చెప్పిన సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి సూత్రాలను అమలుచేయడానికి న్యాయసమీక్ష పరంగా నిలబడే డాక్యుమెంట్ అవసరం. ఇప్పుడు మేం ఆ డాక్యుమెంట్‌ను తయారుచేశాం. దీని ఆధారంగా రిజర్వేషన్ల పెంపునకు న్యాయస్థానాలూ అనుమతిస్తాయని భావిస్తున్నాం. ఇది దేశంలో ఒక విప్లవాత్మక ముందడుగు. ఈ సర్వే ఆధారంగా మా ప్రభుత్వం ద్విముఖ వ్యూహం అనుసరిస్తుంది. సమతౌల్యం, సమ్మిళితమైన అభివృద్ధికి దీన్ని మేం ప్రాతిపదికగా చేసుకుంటాం.

**సొంత సామాజికవర్గం ఒత్తిళ్లను తట్టుకొని సీఎం సర్వేను విజయవంతంగా నిర్వహించారు**


**మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు**

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, ఖర్గే, ప్రియాంకాగాంధీలు తెలంగాణకు వచ్చి ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించారు. దానికితోడు రాహుల్‌గాంధీ ప్రకటించిన కులగణన గురించి బీసీలంతా నమ్మి కాంగ్రెస్‌కు ఓటేశారు. దానివల్లే అధికారంలోకి రాగలిగాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓబీసీ వర్గానికి చెందిన వారు కాకపోయినా.. తన సొంత సామాజికవర్గం నుంచి తీవ్ర విమర్శలు, ఒత్తిళ్లు వచ్చినా తట్టుకొని నిలబడి ఖర్గే, రాహుల్‌గాంధీలకు నిజమైన సైనికుడిలా పనిచేసి కులగణను విజయవంతంగా నిర్వహించినందుకు ధన్యవాదాలు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తాం. కేంద్రం ఆమోదం తెలపకుంటే.. రాహుల్ నేతృత్వంలో ఉద్యమం చేస్తాం.

మొదటి పేజీ తరువాయి

# నాలుగో రోజూ అదే తీరు

ఈ కబురు,దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో వరసగా నాలుగోరోజూ ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై ఉభయసభల్లో విపక్ష సభ్యులు మరోసారి పెద్దఎత్తున ఆక్షేపణ తెలిపి, కార్యకలాపాలను స్తంభింపజేశారు. ఉదయం ప్రారంభమైనప్పటి నుంచి వాయిదాపడుతూ వచ్చిన సమావేశాలు.. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత మరోసారి సమావేశమై, వెంటనే శుక్రవారానికి వాయిదాపడిపోయాయి. ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. సముద్ర రవాణాకు సంబంధించిన బిల్లుపై చర్చను కొనసాగించడానికి సభాధ్యక్ష స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలీతా ప్రయత్నించినా విపక్షాలు దానికి ఆస్కారమివ్వలేదు. పలువురు సభ్యులు సభాపతి స్థానంవద్ద బైఠాయించారు. బిల్లుపై మాట్లాడుతున్న సభ్యుల స్థానాల వద్దకు విపక్ష ఎంపీలు వెళ్లి ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా అక్కడా నినాదాలిచ్చారు. తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యులు గురువారం రిటైరవుతున్న సందర్భంగా వారికి వీడ్కోలిచ్చిన తర్వాత మళ్లీ నిరసనలు కొనసాగాయి. 30 వాయిదా తీర్మాన నోటీసులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించడంపై సభ్యులు గళమెత్తారు. ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌కు హుందాగా వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ కోరినా ప్రభుత్వం నుంచి స్పందనరాలేదు. రాజ్యసభ సభ్యుడిగా నియమితుడైన ఉజ్వల్ దేవ్‌రావ్ నికం బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణం చేశారు. లోక్‌సభలోనూ విపక్ష నిరసనలు కొనసాగాయి. ఎంతవారిస్తున్నా ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకువచ్చి నినాదఫలకాలు ప్రదర్శించడంతో స్పీకర్ ఓంబిర్లా అభ్యంతరం తెలిపి.. ఏడు నిమిషాల్లోనే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి సమావేశమయ్యాక గోవాలో ఎస్టీ స్థానాల బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభాపతి స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ కోరినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. దీంతో సభను వాయిదావేశారు.



# సహకార విధానాన్ని ప్రకటించిన అమిత్‌షా



ఈ కబురు,దిల్లీ: కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా గురువారం జాతీయ సహకార విధానాన్ని ప్రకటించారు. పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా, సంప్రదాయేతర ఇంధన రంగాల్లో సహకార స్ఫూర్తిని విస్తరించాలని ఈ విధానం పేర్కొంటోంది. ఈ విధానాన్ని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు నేతృత్వంలోని 48 మంది సభ్యుల కమిటీ రూపొందించింది. 2002లో తొలి సహకార విధానాన్ని ప్రకటించిన భాజపా ప్రభుత్వం ఇప్పుడు రెండో విధానాన్నీ రూపొందించిందని అమిత్‌షా విధాన ప్రకటన సందర్భంగా పేర్కొన్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సహకార రంగం వాటాను మూడింతలు చేసి 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో ఈ రంగం కీలక భాగస్వామి కావాలన్న ఆశయాన్ని సాధించాలని ఈ విధానం ఆకాంక్షిస్తోంది. ''2034కల్లా దేశ స్థూల దేశీయోత్పత్తిలో సహకార రంగం వాటా మూడింతలవుతుంది. ఈ లక్ష్యం సాధించడం కష్టసాధ్యమేనని నాకూ తెలుసు. అయితే మేం లక్ష్యసాధన కోసం తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం'' అని అమిత్‌షా పేర్కొన్నారు. ''పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా తదితర రంగాల్లో సహకార స్ఫూర్తి పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందించాం'' అని ఆయన అన్నారు. విధాన లక్ష్యాల సాధనకు సహకార సంఘాల పునాదులు పటిష్ఠం చేయడం, చైతన్యాన్ని పెంపొందించడం, భవితవ్యానికి తగిన రీతిలో తీర్చిదిద్దడం, భిన్న వర్గాలను భాగస్వాముల్ని చేయడం, మరింతగా చొచ్చుకుపోవడం, కొత్త రంగాల్లోకి ప్రవేశించడం అనే ఆరు వ్యూహాలను అమలు పరచనున్నారు. 50 కోట్ల మంది ప్రజల్ని సహకార రంగంలో భాగస్వాముల్ని చేసేందుకు కృషి చేస్తామని అమిత్‌షా ప్రకటించారు. విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ విధానాన్ని ఖరారు చేశారు.

# ప్రజా ప్రతినిధుల కోర్టుకు మంత్రి సీతక్క

ఈ కబురు,హైదరాబాద్: పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క గురువారం నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టులో హాజరయ్యారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021 ఏప్రిల్‌లో ఇందిరా పార్కు వద్ద ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టగా, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెతోపాటు బల్మూరి వెంకట్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించిన విచారణకు మంత్రి సీతక్క వచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తామేం తప్పు చేయలేదని, న్యాయస్థానాలపై నమ్మకం ఉందన్నారు. కరోనాతో మరణించిన ప్రతి కుటుంబానికి వాళ్లు ఆసుపత్రిలో కట్టిన బిల్లులను సీఎంఆర్ఎఫ్ నుంచి చెల్లించాలని కోరుతూ ఆందోళన చేయగా.. నిబంధనలకు విరుద్ధంగా ధర్నా చేసి కొవిడ్ వ్యాప్తి చేస్తున్నారంటూ వారిపై కేసులు నమోదయ్యాయి. అంతకు ముందు విచారణకు గైర్హాజరైనందుకు ఆగ్రహించిన కోర్టు సీతక్కకు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. రీకాల్ చేయాలని ఆమె తరఫు న్యాయవాది కోరగా రూ.10వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. విచారణకు హాజరైన ఆమె పూచీకత్తులు సమర్పించారు. న్యాయస్థానం విచారణను ఆగస్టు 13కి వాయిదా వేసింది.





# అనిల్ అంబానీ ఆఫీసుల్లో ఈడీ సోదాలు

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కి చెందిన కార్యాలయాల్లో దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. దిల్లీ, ముంబయిలోని ప్రాంగణాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నాయి. రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డాయన్న ఆరోపణలపై ఈడీ ఈ సోదాలు చేపట్టింది. అయితే, అనిల్‌కు చెందిన వ్యక్తిగత నివాసానికి మాత్రం ఈడీ అధికారులు వెళ్లలేదని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దిల్లీ, ముంబయి నుంచి వచ్చిన దర్యాప్తు సంస్థ బృందాలు 35 ప్రదేశాల్లో ఈ తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటివరకు 25 మందిని ప్రశ్నించారు.

ఈడీ ప్రాథమిక నివేదిక ప్రకారం.. 2017 నుంచి 2019 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాలను అనిల్ అంబానీ కంపెనీలు అనుమానాస్పద రీతిలో దారి మళ్లించాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇదే అంశంలో యెస్ బ్యాంక్ మాజీ ఎండీ ప్రమోటర్ రాణా కపూర్‌పై దాఖలైన మనీ లాండరింగ్ కేసులో భాగంగా 2020లో అనిల్ అంబానీ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఈడీ తన ప్రాథమిక దర్యాప్తు పేర్కొంది.

# భారతీయులను నియమించుకోవద్దు: టెక్ కంపెనీలకు ట్రంప్ హెచ్చరిక



గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం ఆపి.. అమెరికన్లపై దృష్టిపెట్టాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలమైన సందేశం పంపారు. ఆయన బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఐ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్ కంపెనీల గ్లోబలిస్ట్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. చాలామంది అమెరికన్లు తమను పట్టించుకోవడం లేదన్న భావనలో ఉన్నట్లు పేర్కొన్నారు. దేశంలో లభించిన స్వేచ్ఛను వాడుకొని చాలా టెక్ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తన పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయని చెప్పారు.

''మన దేశంలోని చాలా భారీ టెక్ కంపెనీలు చైనాలో కంపెనీలు నిర్మిస్తూ.. భారతీయ ఉద్యోగులను నియమించుకొంటూ.. ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకొని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవించాయి. ఆ విషయం మీకు తెలుసు. ఇక్కడి ప్రజల అవకాశాలను పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యం చేయడం వంటివి చేశారు. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. ఏఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరం. ఇక్కడ ఉన్న టెక్నాలజీ కంపెనీలు మొత్తం అమెరికా కోసమే. దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలి. మీరూ అది చేయాలి. అదే నేను కోరుతున్నాను'' అని ట్రంప్ పేర్కొన్నారు.

ఈ సదస్సులో ట్రంప్ కృత్రిమ మేధకు సంబంధించి మూడు కీలక ఆదేశాలపై సంతకాలు చేశారు. ఏఐకు ఉన్న ఆటంకాలను తొలగించడం.. అభివృద్ధిని వేగవంతం చేయడం, ఇక ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థలు తయారుచేసే ఏఐ టూల్స్ రాజకీయంగా తటస్థ వైఖరితో ఉండేలా చూడటం వంటి అంశాలున్నాయి.



# నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. పడేసిన ఐటీ, రియల్టీ షేర్లు

ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఐఈఎక్స్, కోఫోర్జ్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ జూన్ త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు స్పందించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 542.47 పాయింట్లు (0.66 శాతం) క్షీణించి 82,184.17 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 157.8 పాయింట్లు లేదా 0.63 శాతం క్షీణించి 25,062.1 వద్ద ముగిశాయి.

ఎటర్నల్ (జొమాటో), టాటా మోటార్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, టైటాన్ షేర్లు టాప్ గెయినర్స్‌గా లాభపడగా, ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) టాప్ లూజర్స్‌గా నిలిచాయి.
విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ వరుసగా 0.58 శాతం, 1.09 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ 2.21 శాతం, నిఫ్టీ రియల్టీ 1.04 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.12 శాతం నష్టపోయాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 1.24 శాతం, నిఫ్టీ ఫార్మా 0.55 శాతం లాభపడ్డాయి.

# ట్రేడ్ డీల్‌తో.. స్కాచ్ విస్కీ, కార్ల ధరలు తగ్గనున్నాయా?





**భారత్, బ్రిటన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, పెట్టుబడులు పెంచడమే లక్ష్యంతో ఇరు దేశాలు చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం పేరుతో చేసుకున్న ఈ ఒప్పందం అనేక రంగాల్లో దోహదం చేయనుందని నిపుణుల అంచనా. ముఖ్యంగా ఇరు దేశాలు పరస్పరం దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను తగ్గించడంతోపాటు పలు వస్తువులను మార్కెట్‌లో స్వేచ్ఛగా విక్రయించేందుకు మార్గం సుగమం చేయడం ప్రధాన అంశంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకొనే కొన్ని వస్తువుల ధరలు తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు.**

భారత్ ఎగుమతి చేసే శ్రామిక ఆధారిత ఉత్పత్తులపై సుంకాలు తగ్గుతాయి. లెదర్, పాదరక్షలు, జౌళి వంటి ఎగుమతి చేసే ఉత్పత్తులు, బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకునే స్కాచ్ విస్కీ, కార్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్కాచ్ విస్కీపై ప్రస్తుతం దిగుమతి సుంకం 150శాతం ఉంది. దీన్ని తొలుత 75శాతానికి తగ్గించనుండగా.. వచ్చే పదేళ్ల నాటికి 40శాతానికి తగ్గిస్తారు. దీంతో ధరలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ అవి ఏ మేరకు తగ్గుతాయనే విషయం ఆయా రాష్ట్రాల మద్యం విధానంపై ఆధారపడి ఉంటుంది.
సాఫ్ట్‌డ్రింక్స్, కాస్మొటిక్స్, చాక్లెట్లు, బిస్కెట్లు, వైద్య పరికరాలను బ్రిటన్ కంపెనీలు మన దేశంలో తేలికగా విక్రయించే అవకాశం ఉంది. వీటి ధరలు కూడా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కార్లపై విధిస్తున్న 100శాతం సుంకాలను ఇరు దేశాలు 10శాతానికి తగ్గించనున్నాయి. దీంతో రానున్న రోజుల్లో వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది.
భారత్ నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే వస్తువులపైనా బ్రిటన్ సుంకాలు తగ్గించనుంది. బంగారు నగలు, వజ్రాలు, లెదర్, వస్త్రాలు, పాదరక్షలపై సుంకాలు తగ్గనుండగా.. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, బాస్మతి బియ్యం, టీ, మసాలాలను ఇంగ్లండ్ మార్కెట్‌లో స్వేచ్ఛగా విక్రయించే వీలు కలుగుతుంది. ఈ ఒప్పందం ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణకు దోహదపడుతాయని ఇరు దేశాల ఆశిస్తున్నాయి. ఐటీ, అనుబంధ రంగాలు, ఆర్థిక సేవలు, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ఆర్కిటెక్చరల్, ఇంజినీరింగ్ రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు వ్యాపార, విద్యాపరమైన రంగాల్లో నైపుణ్య శిక్షణకు అవకాశాలు మెరుగవుతాయని అంచనా.

# రూ.14 వేలకే 5 జ్యోతిర్లింగాల దర్శనం.. ఐఆర్‌సీటీసీ కొత్త ప్యాకేజీ వివరాలివీ..

**ఐదు జ్యోతిర్లింగాల దర్శనంతో పాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంలోని ముఖ్య ప్రదేశాలను చూసేలా ఐఆర్‌సీటీసీ ప్రత్యేక యాత్రను ప్రకటించింది. 'అంబేడ్కర్ యాత్ర విత్ పంచ జ్యోతిర్లింగ దర్శన్' పేరిట ఈ ప్యాకేజీని తీసుకొచ్చింది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఆగస్టు 16న ప్రారంభమయ్యే ఈ యాత్ర 24న ముగుస్తుంది.**




మొత్తం ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజుల్లో పూర్తవుతుంది. ఈ రైలు ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం, దీక్షా భూమి స్థూపం (అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశం), నాగ్‌పుర్‌లోని స్వామినారాయణ మందిరం, మహూ వద్ద జన్మభూమి (అంబేడ్కర్ జన్మస్థలం), నాసిక్ వద్ద త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, పుణెలో భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్ వద్ద ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం మొదలైన ప్రదేశాలను సందర్శించే అవకాశం ఈ యాత్రలో ఉంటుందని ఐఆర్‌టీసీటీసీ తెలిపింది. రాష్ట్రంలో సికింద్రాబాద్‌తో పాటు కామారెడ్డి, నిజామాబాద్, స్టేషన్లలో ప్రయాణికులు రైలు ఎక్కేందుకు సౌకర్యం కల్పించింది. రైలు, రోడ్డు రవాణా, వసతి సౌకర్యం, భోజనం సహా అన్నిరకాల ఏర్పాట్లు ఉంటాయని పేర్కొంది. ఈ యాత్రకు తరగతిని బట్టి ఛార్జీ ఉంటుంది.

**ప్రయాణం ఇలా..**

ఆగస్టు 16న సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటలకు రైలు ప్రారంభమవుతుంది. సాయంత్రం 4:30 గంటలకు కామారెడ్డి, 5:40 గంటలకు నిజామాబాద్‌లో ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. రాత్రంతా ప్రయాణించాల్సి ఉంటుంది.రెండో రోజు ఉదయం ఎనిమిది గంటలకు నాగ్‌పుర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఆర్‌సీటీసీ సిబ్బంది దీక్ష భూమి స్థూపం వద్దకు తీసుకెళ్తారు. దాని తర్వాత సమయం ఉంటే శ్రీ స్వామినారాయణ మందిర్‌కు తీసుకెళ్తారు. ఆ తర్వాత ఉజ్జయినికి వెళ్లేందుకు మళ్లీ నాగ్‌పుర్ రైల్వే స్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది.
మూడో రోజు ఉజ్జయిని చేరుకున్నాక మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ దర్శనానికి తీసుకెళ్తారు. ముందుగానే ఏర్పాటు చేసిన హోటల్‌లో ఆ రోజు రాత్రి బస ఉంటుంది.
నాలుగో రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జన్మస్థలమైన జన్మభూమిని చూడడానికి తీసుకెళ్తారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనం ఉంటుంది. దాని తర్వాత నాసిక్ వెళ్లేందుకు అంబేడ్కర్ నగర్ రైల్వే స్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది.
ఐదో రోజు నాసిక్ రైల్వే స్టేషన్ చేరుకుంటారు. అక్కడ హోటల్‌లోనే రాత్రి బస ఉంటుంది.
ఆరో రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేశాక త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగ దర్శనానికి తీసుకెళ్తారు. దాని తర్వాత పుణె వెళ్లేందుకు నాసిక్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్తారు.
ఏడో రోజు పుణెలోని ఖడ్కి రైల్వే స్టేషన్ చేరుకుంటారు. తర్వాత హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి భీమశంకర్ జ్యోతిర్లింగ దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అనంతరం ఔరంగబాద్ వెళ్లేందుకు ఖడ్కి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు.
ఎనిమిదో రోజు ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుంటారు. హోటల్‌కు వెళ్లి అక్కడి నుంచి ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగ దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అనంతరం సికింద్రాబాద్‌కు తిరిగి రైలు ఎక్కేందుకు ఔరంగబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలి.
తొమ్మిదో రోజు అర్ధరాత్రి 12:20 గంటలకు నిజామాబాద్, 1:32 గంటలకు కామారెడ్డి, ఉదయం 4 గంటలకు రైలు సికింద్రాబాద్ చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది.

**ప్యాకేజీ ఛార్జీలు...**

**కంఫర్ట్‌లో(2ఏసీ) ప్రయాణానికి ఒక్కో ప్రయాణికుడికి రూ.29900, 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.28400 చెల్లించాలి.స్టాండర్డ్‌లో (3ఏసీ) ఒక్కో ప్రయాణికుడు రూ.22900, చిన్నారులైతే రూ.21700 చెల్లించాలి.ఎకానమీలో (స్లీపర్) ఒక్కో ప్రయాణికుడు రూ.14700, చిన్నారులకు టికెట్ ధర రూ. 13700గా నిర్ణయించారు.**

**ఇవి ప్యాకేజీలో భాగమే..**

**ఎంచుకున్న ప్యాకేజీని బట్టి రైల్లో 3ఏసీ, 2ఏసీ, స్లీపర్ క్లాస్ ప్రయాణంప్యాకేజీని బట్టి ప్రయాణానికి ఏసీ వాహనం సమకూరుస్తారు.యాత్రలో బస చేయడానికి గదులు, ఉదయం అల్పాహారం ఉచితంగా లభిస్తుంది.**
**యాత్రికులకు ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది.**
**టోల్, పార్కింగ్ ఛార్జీలు వంటివి ప్యాకేజీలో భాగమే.**
**ఈ టూర్‌కు సంబంధించి మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం ఈ ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించండి. బుకింగ్ కోసం 9701360701, 9281030712, 9281030711 నంబర్లను సంప్రదించొచ్చు.**

# ఉపాధిని తొలగించే టెక్నాలజీ ఎందుకు?

**సాంకేతిక పురోగతి ఉపాధిని తొలగించేదిగా ఉండకూడదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ తెలిపారు. టెక్నాలజీ అనేది కార్మికులను గౌరవించి, పరిశ్రమలకు మద్దతు ఇచ్చేలా, జాతీయ ప్రయోజనాలకు ఉపయోగపడేలా సమతుల్య విధానాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో భగవత్ మాట్లాడారు. బీఎంఎస్ ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్న భారతదేశపు అతిపెద్ద కార్మిక సంఘం.**



'ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరివర్తన సవాలుగా మారుతోంది. ప్రతి కొత్త టెక్నాలజీ ప్రాథమికంగా ఆందోళన కలిగిస్తుంది. నాలెడ్జ్ బేస్డ్ టెక్నాలజీ సంబంధిత రంగంలోని ఉద్యోగాలపై ప్రభావం చూపకూడదు. దాని ప్రతిష్ఠను దిగజార్చకూడదు. మారుతున్న ఆర్థిక, సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా కార్మిక, పారిశ్రామిక, జాతీయ ప్రయోజనాలను సమన్వయం చేసేలా సాంకేతిక అభివృద్ధి ఉండాలి. ప్రతి ఆవిష్కరణలో ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా మాన్యువల్ లేదా సెమీ స్కిల్డ్ లేబర్‌పై ఎక్కువగా ఆధారపడే రంగాల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుందని గుర్తుంచుకోవాలి' అన్నారు.

# ‘బాయ్‌కాట్’ అన్నారు.. నా సినిమా మిమ్మల్ని అంత భయపెట్టిందా?: పవన్

**హైదరాబాద్:** తన కెరీర్‌లో సినిమా సక్సెస్ మీట్‌కు హాజరవడం తొలిసారి అని ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తన కొత్త సినిమా ‘హరిహర వీరమల్లు’ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ‘‘క్యాబినెట్ మీటింగ్ వల్ల ఈ ఈవెంట్‌కు రావడం ఆలస్యమైంది. క్షమించండి. నాకు సినిమా ప్రమోషన్స్ అలవాటు లేదు. తొలిసారి సక్సెస్ మీట్‌కు హాజరయ్యా. ఈ రోజు ఉదయం మంత్రివర్గ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖపై మాట్లాడా. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న నేను పంచాయితీలు చేసి సినిమా రిలీజ్ చేయాల్సి వచ్చింది. జీవితకాలంలో ఏదీ తేలిగ్గా దొరకలేదు. నా జీవితం వడ్డించిన విస్తరి కాదు. ‘డిప్యూటీ సీఎంని కదా సినిమా సులువుగా విడుదలవుతుంది’ అని అనుకున్నా. కానీ, వారం నుంచి నిద్రపోలేదు. గత రెండు రోజుల్లో నేను మాట్లాడిన విషయాలు నా 29ఏళ్ల సినీ జీవితంలో 10 శాతం కూడా మాట్లాడలేదు’’ అని అన్నారు.



**మన రాజులను చిన్నచూపు చూశారు**

‘‘నన్ను నేను హీరోగా ఎప్పుడు ఊహించుకోలేదు. విధి నన్ను హీరోని, రాజకీయ నాయకుడిని చేసింది. ఈ సినిమా విజయం ఏ స్థాయి అనేది నిజంగా నాకు తెలియదు. పీరియాడిక్ చిత్రాలపై నాకెప్పుడూ సందేహం ఉండేది. వాటిలో వీఎఫ్ఎక్స్ కన్నా ఎమోషన్స్ ఎలా ఉన్నాయనేది చూడాలి. కృష్ణదేవరాయ, రుద్రమదేవి గ్రేట్ అని ఎందుకు చెప్పడం లేదు. మొఘల్ సామ్రాజ్యం చరిత్ర తిప్పికొడితే 200 ఏళ్లు లేదు. చరిత్ర రాసినవాళ్లు మన రాజులపై చిన్నచూపు చూశారు. ఔరంగజేబు మరణించి చాలా రోజులైంది. అతడి గురించి మాట్లాడితే మనవాళ్లు సెన్సిటివ్ అయిపోతారు. ఔరంగజేబు చేసిన దారుణాలను దాచిపెట్టారు’’

**నా సినిమా అంత భయపెట్టిందా?**

‘‘ఈ సినిమా క్లైమాక్స్ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది.‘హరిహర వీరమల్లు’ పార్ట్ 2 త్వరగా పూర్తికావాలని కోరుకుంటున్నా. ఇప్పటికే దాదాపు 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ‘హరిహర వీరమల్లు’ను బాయ్ కాట్ చేద్దామని బెదిరించారు. నా సినిమా మిమ్మల్ని (రాజకీయ ప్రత్యర్థులనుద్దేశించి) అంత భయపెట్టిందా?’’ అని ప్రశ్నించారు.

**ఆ అంశాన్ని ప్రస్తావించినందుకు ఆనందంగా ఉంది..**

‘‘నా సినిమాలో కోహినూర్ వజ్రం కన్నా మనిషి విజ్ఞానం గురించి చెప్పాం. కోహినూర్ పగిలిపోవచ్చు. కానీ, విజ్ఞానం పోదు. వేదాలను కోహినూర్‌లాగా భద్రపరచలేదు. మన వేదాలను మనసులో పెట్టుకున్నారు. అదే మన దేశ సంస్కృతి గొప్పదనం. ఈ అంశాన్ని చర్చించడంలో ‘హరిహర వీరమల్లు’ విజయం సాధించింది. హిందువుగా ఉంటే జిజియా పన్ను ఎందుకు కట్టాలని ఎవరూ అడగరేంటని అనుకునేవాడిని. ఆ విషయాన్ని ఇందులో ప్రస్తావించినందుకు ఆనందంగా ఉంది. ఈ మొదటి భాగంలో ఏవైనా పొరపాట్లు ఉంటే చెప్పండి. రెండో భాగంలో సరిదిద్దుకుంటాం’’

**నాకు డిప్రెషన్ ఉండదు..**

‘‘నేనిలా ఉన్నానంటే దానికి కారణం మీరే (ఫ్యాన్స్). సోషల్ మీడియాలో కామెంట్స్‌కు మీరు నిరుత్సాహపడొద్దు. తగిన విధంగా తిప్పికొట్టండి. నేను ఎంత ఎదిగానో తెలియదుగానీ ధైర్యంగా ఉండడం ఒక్కటే తెలుసు. నాకు డిప్రెషన్ ఉండదు. విజయం కన్నా బతకడం ముఖ్యం అనుకుంటా. ‘మన సినిమా గురించి నెగెటివ్‌గా మాట్లాడుతున్నారు సర్’ అని చెబుతున్నారు. వాళ్లు నెగెటివ్‌గా మాట్లాడుతున్నారంటే.. మనం బలమైన వాళ్లమని అర్థం’’ అని పేర్కొన్నారు.

# కటిక పేదరికం.. ఇరుకు గదిలో 12 మంది ఒకరిపై ఒకరం నిద్రించేవాళ్లం..

రేసుగుర్రం విలన్ రవికిషన్ బాల్యంలో కటిక పేదరికం అనుభవించారు. సినిమాల మీద ఆసక్తితో రూ.500 నోటుతో ఇంటి నుంచి పారిపోయి ముంబై వచ్చారు. కెరీర్ తొలినాళ్లలో ఎన్నో కష్టాలు పడ్డ ఆయన రానురానూ తన టాలెంట్‌తో గుర్తింపు సంపాదించారు. భోజ్‌పురి, హిందీ చిత్రపరిశ్రమలో టాప్ నటుడిగా పేరు తెచ్చుకున్నారు.

**కటిక పేదరికం**

తాజాగా రవికిషన్ ఓ పాడ్‌కాస్ట్‌లో తన బాల్యంలోని బాధల్ని చెప్పుకొచ్చారు. నేను కటిక పేదరికం అనుభవించాను. చాలా సార్లు నా జీవితాన్ని అసహ్యించుకునేవాడిని. మా ఇంట్లో 12 మంది ఉండేవాళ్లం. కొద్దిపాటి బియ్యంతో నీళ్లలా చేసే కిచిడీని కుటుంబమంతా తినేవాళ్లం. చిన్నగదిలోనే మేమందరం పడుకునేవాళ్లం. ఒక్కోసారి ఒకరిపై మరొకరం నిద్రించేవాళ్లం.

**ఆరోజే అనుకున్నా**

పేదరికంలో ఉన్న మమ్మల్ని చూసి చాలామంది వెక్కిరించారు. నా తండ్రిని ఎవరూ హేళన చేయకూడదని, ఆ స్థాయికి నేను చేరుకోవాలని చిన్నతనంలోనే బలంగా నిశ్చయించుకున్నాను. ఈ భూమి మీదకు వచ్చామంటే ఏదో ఒకటి చేసి పోవాల్సిందే! అంతేకానీ పక్కింటివాళ్లకు కూడా తెలియకుండా అనామకులుగా చనిపోతే ఏం లాభం? కేవలం పిల్లల్ని కనడానికో, బంగ్లాలు కట్టడానికో ఈ భూమిపైకి రాలేదు కదా! మనకంటూ ఓ గుర్తింపు ఉండాలి. ఒక్కసారి మనకు పేరు వచ్చిందంటే డబ్బు దానంతటదే వస్తుందని బలంగా నమ్మాను అని చెప్పుకొచ్చారు.

**డబ్బు లేకపోతే..**

ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. ప్రతిరోజు జిమ్‌కు వెళ్లండి, అంత డబ్బు లేదంటే రోడ్డుపై పరిగెత్తండి. కనీసం 35 కి.మీ అయినా పరిగెత్తండి, 200 పుషప్స్ చేయండి. శనగలను రాత్రంతా నానబెట్టి తెల్లారి ఆ నీళ్లను తాగండి, శనగలను తినండి. మీరు పేదవాళ్లయినప్పటికీ ఇవన్నీ చేయొచ్చు. ప్రభుత్వం ఫ్రీగా ఇచ్చే నిత్యావసర సరుకులను ఇలా వాడుకోవచ్చు. కనీసం సూర్యోదయానికి ముందు లేవడమైనా అలవాటు చేసుకోండి అని సూచించారు.


**సినిమా**

పీతాంబర్ (1992) సినిమాతో రవికిషన్ సినీప్రయాణం ఆరంభమైంది. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో అనేక సినిమాలు చేశారు. తెలుగులో రేసుగుర్రం, కిక్ 2, హీరో, 90 ఎమ్ఎల్, డాకు మహారాజ్ చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆయన నటించిన సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీ వచ్చే నెలలో విడుదల కానుంది.



## నేను వార్2లో ఎందుకు నటించలేదంటే..: వాణీ కపూర్

భారీ అంచనాల మధ్య ‘వార్ 2’ ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీ, తెలుగు, తమిళ్‌లో ఏకకాలంలో విడుదల కానుంది. ఇందులో హృతిక్ రోషన్ , జూనియర్ ఎన్టీఆర్ , కియారా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే ఈ చిత్రం 2019లో విడుదలైన ‘వార్’కు సీక్వెల్ చిత్రం. ఆ సినిమాలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ , వాణీ కపూర్ నటించారు. అయితే ‘వార్ 2’లో టైగర్ ష్రాఫ్, వాణీ కపూర్ భాగం కాలేదు. ‘వార్ 2’లో తాను లేకపోవడంపై వాణీ కపూర్ తాజాగా స్పందించారు. ప్రస్తుతం వాణీ కపూర్ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ అయిన ‘మండల మర్డర్స్’ ప్రమోషన్లలో తీరిక లేకుండా ఉన్నారు. ఈ నేపథ్యంలో ‘వార్ 2’లో ఎందుకు నటించలేదని తనకు ఎదురైన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. ఈ విషయమై ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ... ‘నా తరఫున వార్ 2 బృందానికి అభినందనలు. నిజానికి నేను కనీసం ‘వార్’లోనైనా భాగమైనందుకు ఆనందంగా ఉంది’ అని అన్నారు. ‘వార్’లో టైగర్ ష్రాఫ్ పోషించిన పాత్ర చనిపోతుంది. ఈ విషయాన్ని ఆమె కాస్త సరదాగా ప్రస్తావిస్తూ.. ‘నేను, డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్, టైగర్ ష్రాఫ్ ‘వార్ 2’లో భాగం కాలేదు. టైగర్, నేను ‘వార్’లో చనిపోయాం. ఒక వేళ టైగర్ ష్రాఫ్ తిరిగి వస్తే, నేనూ వస్తాను’ అన్నారు. మండల మర్డర్స్‌లో వాణీ కపూర్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ పాత్రను పోషించారు. దీనికి గోపి పుత్రన్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ చరణ్‌దాస్‌పూర్ పట్టణంలో జరిగే హత్యల చుట్టూ తిరుగుతుంది. ఇందులో సుర్వీన్ చావ్లా, వైభవ్ రాజ్ గుప్తా కూడా కీలక పాత్రలు పోషించారు.




# ‘కింగ్డమ్’ టికెట్ ధరల పెంపు.. ఏపీ ప్రభుత్వం అనుమతి.. ఎంతంటే?

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ యాక్షన్ మూవీ ‘కింగ్డమ్’. ఈ నెల 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే టికెట్ ధరల పెంపు కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చిత్ర బృందం ఇటీవల విజ్ఞప్తి చేసింది. సినిమా విడుదల రోజు నుంచి పది రోజుల పాటు ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు వీలు కల్పించింది.

ఒక రోజు ముందుగా ప్రీమియర్ ప్రదర్శించే అవకాశాలున్నట్టు తెలిసింది. మరోవైపు, సినిమాని ప్రేక్షకులకు చేరువ చేసేందుకు చిత్ర బృందం ప్రచారాన్ని వేగవంతం చేస్తోంది. ఇప్పటికే టీజర్, పాటలను రిలీజ్ చేసిన టీమ్.. ఈ నెల 26న ట్రైలర్‌ను విడుదల చేయనుంది. అదే రోజున తిరుపతిలో వేడుక నిర్వహించనున్నారు.

‘జెర్సీ’ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. గూఢచారిగా విజయ్ కనిపించనున్నారని సమాచారం. ఆయన సోదరుడిగా సత్యదేవ్ నటించారు. యాక్షన్‌కు అధిక ప్రాధాన్యం ఉన్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్.

# నా విషయంలో పేరెంట్స్ ఎక్కువ గర్వపడిందప్పుడే: రష్మిక

తన విషయంలో తల్లిదండ్రులు ఎక్కువగా గర్వపడిన సందర్భాన్ని రష్మిక గుర్తుచేసుకుంది. తాను నటించిన సినిమాల చిత్రీకరణ జ్ఞాపకాలూ నెమరువేసుకుంది. ఓ బ్రాండ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమెకు కొన్ని ఫొటోలు చూపించగా.. వాటి వెనుక కథను చెప్పింది. బెంగళూరు విమానాశ్రయంలో తన తండ్రితో కలిసి దిగిన ఫొటో గురించి చెబుతూ.. ‘‘నేను ‘ఫ్రెష్ ఫేస్’ టైటిల్ గెలిచిన సమయంలో (2014).. కానుకగా కొన్న గొలుసును ఎయిర్‌పోర్టులోనే నాన్న నా మెడలో ధరింపచేశారు. ఈ మరుపురాని క్షణాలను అమ్మ కెమెరాలో బంధించింది. నా విషయంలో పేరెంట్స్ అప్పుడే ఎక్కువగా గర్వపడ్డారని అనుకుంటున్నా’’ అని పేర్కొంది.

సినిమాల గురించి మాట్లాడుతూ.. ‘వారసుడు’లో విజయ్‌తో కలిసి నటించే అవకాశం వచ్చినప్పుడు చాలా సంతోషించానని తెలిపింది. ‘పుష్ప 2’ చిత్రం షూటింగ్ ఆఖరి రోజున భావోద్వేగానికి గురయ్యానని చెప్పింది. ప్రస్తుతానికి ఈ మూవీ టీమ్‌ని మిస్ అవుతున్నానని, ‘పుష్ప 3’తో మళ్లీ కలుస్తామని పేర్కొంది. ‘యానిమల్’ సినిమాతో రణ్‌బీర్ కపూర్ తనకు మంచి స్నేహితుడయ్యాడని, విక్కీ కౌశల్‌తో కలిసి నటించిన ‘ఛావా’ షూటింగ్‌లో ఎప్పుడూ కష్టమనిపించలేదని తెలిపింది. ఇటీవల విడుదలైన.. ‘కుబేర’ లో సమీరగా అలరించిన రష్మిక ‘ది గర్ల్‌ఫ్రెండ్’ , ‘మైసా’, ‘థామా’ తదితర చిత్రాల్లో నటిస్తోంది.







## ఫైనల్‌కు హంపి.. టైటిల్ ఇక భారత గ్రాండ్‌మాస్టర్‌దే

మహిళల ఫిడే వరల్డ్ కప్‌ను తొలిసారిగా భారత గ్రాండ్‌మాస్టర్ సొంతం కావడం లాంఛనమే. భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లలో ఒకరు విజేతగా నిలబోతున్నారు. జార్జియాలో జరుగుతున్న టోర్నీలో ఇప్పటికే దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరుకుంది. తాజాగా కోనేరు హంపి కూడా ఫైనల్‌లో అడుగుపెట్టింది. గురువారం ముగిసిన సెమీస్‌లో హంపి 53తేడాతో చైనాకు చెందిన లీ టింగ్జీపై విజయం సాధించింది. 8 గేములపాటు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో చివరికి హంపినే విజయం వరించింది. తొలి రెండు క్లాసికల్ గేములు డ్రాగా ముగియడంతో మ్యాచ్ టై బ్రేకర్స్‌కు వెళ్లింది. అక్కడ కూడా త్వరగా ఎవరూ ఓటమిని అంగీకరించలేదు. తొలి రెండు టై బ్రేకర్స్‌లో కూడా పాయింట్స్ పంచుకున్నారు. కానీ, మూడో ర్యాపిడ్ గేములో చైనా గ్రాండ్‌మాస్టర్ గెలిచి 32తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ, ఆ తర్వాత హంపి పుంజుకుంది. వరుసగా మూడు ర్యాపిడ్ గేములను నెగ్గి విజేతగా నిలిచింది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో హంపి, దివ్య మధ్య ఫైనల్ జరగనుంది. ఇప్పటివరకు మహిళల ఫిడే వరల్డ్ కప్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ గెలవలేదు. ఈ సారి హంపి, దివ్యలలో ఒకరు చరిత్ర తిరగరాయనున్నారు.




### దుబాయ్, అబుదాబి వేదికగా

## సెప్టెంబరు 5 నుంచి 21 వరకు ఆసియా కప్

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఆసియా కప్ 2025 నిర్వాహణకు తేదీలు ఖరారు అయ్యాయి. దుబాయ్, అబుదాబి దేశాల్లో నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, యుఎఇ, ఒమన్, హాంకాంగ్ పాల్గొంటాయి. భారతదేశం అధికారిక హోస్ట్‌గా ఉన్నప్పటికీ.. భారత్‌పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా ఆందోళనల కారణంగా టోర్నమెంట్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో నిర్వహించాలని ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ నిర్ణయించింది. భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ ఫుల్ టైమ్ జట్లుగా ఉండగా.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ , ఒమన్, హాంకాంగ్ అసోసియేట్ మెంబర్స్‌గా ఉన్నాయి. ఈ టోర్నీలో మొత్తం 8 జట్లు రెండు గ్రూప్‌లుగా విభజించబడతాయి.. ప్రతి గ్రూప్‌లో 4 జట్లు ఉంటాయి. గ్రూప్ A: భారతదేశం, పాకిస్తాన్, UAE, ఒమన్/నేపాల్ (క్వాలిఫికేషన్ ఆధారంగా). గ్రూప్ B: ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, హాంకాంగ్ ఉన్నాయి. అయితే ఈ టోర్నీకి సంబంధించిన పూర్తి స్థాయి షెడ్యూల్ త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.




# తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358 ఆలౌట్

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాల్గవ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 114.1 ఓవర్లలో 358 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి రోజు స్టంప్స్ వరకు 264/4తో బలమైన స్థితిలో ఉన్న భారత్, రెండో రోజు ఉదయం సెషన్లో 44 పరుగుల వ్యవధిలో చివరి 5 వికెట్లను కోల్పోయింది. బీ. సాయి సుదర్శన్ 61 (174 బంతులు, 7 ఫోర్లు), యశస్వి జైశ్వాల్ 58 (107 బంతులు, 10 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ 54 (75 బంతులు) తో రాణించారు.

మొదటి రోజు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా,భారత్ బ్యాటింగ్ ప్రారంభించింది. కేఎల్ రాహుల్ (46), జైశ్వాల్ 94 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో బలమైన పునాది వేశారు. రాహుల్‌ను క్రిస్ వోక్స్, జైశ్వాల్‌ను లియామ్ డాసన్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (12)ను స్టోక్స్ ఔట్ చేశారు. సాయి సుదర్శన్ కూడా స్టోక్స్ బౌన్సర్‌కు పుల్ షాట్ ఆడబోయి ఔటయ్యాడు.

ఇక 68వ ఓవర్‌లో వోక్స్ యార్కర్‌ను రివర్స్ స్వీప్ ఆడబోయిన రిషబ్ పంత్ కుడి పాదానికి గాయమై మైదానం వీడాల్సి వచ్చింది. రెండో రోజు నొప్పితోనే తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి, 54 పరుగులతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. రవీంద్ర జడేజా (25),




శార్దూల్ ఠాకూర్ (41), వాషింగ్టన్ సుందర్ (27) కొంత నిలదొక్కుకున్నప్పటికీ.. స్టోక్స్ (5/72), జోఫ్రా ఆర్చర్ (3 వికెట్లు) బౌలింగ్‌లో భారత్ చివరి వికెట్లను త్వరగా కోల్పోయింది. ఈ టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ 21తో ఆధిక్యంలో ఉండగా, సిరీస్‌ను సమం చేయాలంటే భారత్ ఈ మ్యాచ్‌లో గెలవాల్సి ఉంది.

# డబ్ల్యూడబ్ల్యూఎఫ్ దిగ్గజం హల్క్ హోగన్ కన్నుమూత

**దిగ్గజ రెజ్లర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (ప్రస్తుతం డబ్ల్యూడబ్ల్యూఈ) సూపర్ స్టార్ హల్క్ హోగన్ (71) ఇవాళ (జులై 24) ఉదయం కన్నుమూసినట్లు తెలుస్తుంది. అమెరికాలోని ఫ్లోరిడాలో గల తన నివాసంలో హోగన్ తుది శ్వాస విడిచారని సమాచారం. కార్డియాక్ అరెస్ట్ కారణంగా హోగన్ మృతి చెందినట్లు తెలుస్తుంది.**

1953 ఆగస్ట్ 11న జన్మించిన హోగన్ అసలు పేరు టెర్రి జీనీ బోల్లియా. 80వ దశకంలో హోగన్ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ద్వారా విశేష ప్రజాదరణ పొందారు. హోగన్ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రెజిల్ మానియాలోని తొలి తొమ్మిది ఎడిషన్లలో ఎనిమిది టైటిళ్లు సాధించాడు.

హోగన్‌కు డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్ ఫేమర్లలో కూడా చోటు దక్కింది. 1984లో హోగన్ తన తొలి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. హోగన్ తన కెరీర్ ఉన్నతిలో ఆండ్రీ ద జెయింట్, మాఛో మ్యాన్ రాండీ సావేజ్, అల్టిమేట్ వారియర్ లాంటి దిగ్గజ రెజ్లర్లతో కుస్తీ పడ్డాడు.






హోగన్‌కు అతని మీసాలు చాలా ప్రత్యేకతనిచ్చాయి. హోగన్ రెజ్లింగ్ కాకుండా సినిమాలు, టీవీ రియాలిటీ షోల్లో కూడా నటించాడు. హోగన్ గడిచిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ తరఫున ప్రచారం చేశాడు. హోగన్‌కు భారత్‌లోనూ ఫ్యాన్స్ ఉన్నారు. 80వ దశకంలో పిల్లలకు హోగన్ సుపరిచితుడు.









భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే ఆమె ఇంటిదారిపట్టింది. మరో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా చేతిలో ఆమె చిత్తయ్యింది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో సింధుపై 1621, 2119, 1321 తేడాతో హుడా విజయం సాధించింది. గెలుపు కోసం ఇద్దరూ నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. గంటా 13 నిమిషాల పాటు మ్యాచ్ సాగింది. తొలి గేము హుడా నెగ్గగా.. రెండో గేము సింధు కైవసం చేసుకుంది. చెరో గేమ్ గెలవడంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో గేముకు వెళ్లింది. అక్కడ హుడా అద్భుత ప్రదర్శన చేసి సింధును నిలువరించి విజేతగా నిలిచింది. దీంతో హుడా క్వార్టర్స్‌కు చేరుకోగా.. సింధు నిష్క్రమించింది. క్వార్టర్స్‌లో జపాన్ క్రీడాకారిణి యమగూచితో హుడా తలపడనుంది. మెన్స్ సింగిల్స్‌లో హెచ్. ఎస్ ప్రణయ్ ఇంటిదారిపట్టాడు. రెండో రౌండ్‌లో చైనీస్ తైపీ షట్లర్ చౌ టియెన్ చెన్ 1821, 2115, 218 తేడాతో ప్రణయ్‌ను ఓడించాడు. తొలి గేము నెగ్గి శుభారంభం చేసిన ప్రణయ్ ఆ తర్వాత పలు తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు.

**క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ**

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డిచిరాగ్ శెట్టి జోడీ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. రెండో రౌండ్‌లో సాత్విక్ జోడీ 2119, 2119 తేడాతో ఇండోనేషియాకు చెందిన లియో రోలీ కర్నాండోబగాస్ మౌలానా జంటపై గెలుపొందింది. 43 నిమిషాలపాటు రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థులు తీవ్ర పోటీ నిచ్చినప్పటికీ సాత్విక్ జంట మాత్రం వెనకడుగు వేయలేదు. ప్రత్యర్థి జంట తప్పిదాలను సద్వినియోగం చేసుకుని వరుసగా రెండు గేముల్లోనే మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.